పాము

భూపాల్

అమాస చీకటి. నల్లని కంటిరెప్పల తెర దించడానికి కోడికూతతో పల్లె లేస్తుంటే తూర్పుదిక్కు చెట్లమీద పక్షులు తమ పిల్లలకి ముచ్చట్లు చెబుతున్నాయి. పగలల్లా ఎండతో కాగి పొగచూరిన దేహాలకు తెల్లవారు జామున వీచేగాలి కొంత సేదదీరుస్తోంది.

ఆ అమాస చీకట్లో ఊరి ఉత్తరం అంచునుండి బండ్లబాట మీదుగా ఊరికి తూర్పుదిక్కున ఉన్న సత్తిరెడ్డి బావి కొట్టంవద్ద కొచ్చి కూర్చున్నారు కొందరు స్త్రీ పురుషులు. వాళ్ళతో ముగ్గురు పిల్లలు గూడా వున్నారు. మసక చీకట్లో చెట్లింకా తమ పూర్తి ఆకారాలను సంతరించుకోలేదు. బావి మత్తడిమీదున్న ఇరికి చెట్టు పక్క నుండి ఏదో ఆకారం తెల్లగా వస్తున్నట్లు వాళ్ళకు కనిపించింది.

"ఎవర్రా ఆళ్ళు" కిర్రుచెప్పుల చప్పుడుతో బాటుగా దగ్గరౌతున్న సత్తిరెడ్డి వాళ్ళను ప్రశ్నించాడు.

సత్తిరెడ్డి ఆ ఊరి పెద్ద. రోజులాగే ఈ రోజూ కాలకృత్యాలు తీర్చుకొను 'రాజువెడలె రవితేజమున' అన్నట్లు వస్తున్నాడు.

కూర్చున్న గుంపులోనుండి ఓ ముసలికంఠం "మేం ఎరుకలోల్లం బాంచను" అంది.

"గింత శీకట్లొచ్చి కూసున్నరేంరా! దొంగలా దొరలా?"

"దొంగలం గాము, దొరలమూ గాము బతుకొచ్చినోళ్ళం, కార్మికు" ఆ కంఠమే మళ్ళీ అంది.

సత్తిరెడ్డి వాళ్ళకు దగ్గరగా వచ్చి చూశాడు. ఇరవై మంది వరకూ ఉన్నారు కావడిబద్దలూ, చుట్టిన చాపలూ, కర్రలు, గుడ్డమూటల్లో వంటసామాన్లూ గంపల్లో వస్తువులూ కనిపించాయి.

"ఇక్కడ మా జీతగాళ్ళెవర్లేనట్టుంద్రూ?" అంటూ కొట్టం దిక్కు చూస్తూ "అరే మల్లిగా? యాదిగా?" అని కేకేశాడు.

సమాధానం రాలేదు.

"పొద్దెక్కుతుంది. లంజకొడుకులొక్కరూ లేరు. బాగ పెండ్లాల దెగ్గర పండమరిగింద్రు. బాయికాడి కెందుకొస్తరూ" అంటూ నాలుగడుగులు కుడిదిక్కుగా నడిచి "ఏ ఊర్రా మీదీ" అని అడిగాడు.

"మాది ఒక ఊరా దొరా! పడమటి దేశంనుండి వదొస్తున్నం. ఏడ నాలు

గొద్దులుంటే అదే ఊరనుకుంటం. పూట గడిస్తే సాలు లేకుంటే ఇంకో ఊరు" ఒక ముసలోడు దెగ్గరగా వచ్చి చేతులు జోడించి మొక్కుతూ విన్నవించుకున్నాడు.

సత్తిరెడ్డి అతన్ని ఎగా దిగా చూసి ముందుకు నడిచాడు. దూరంగా ఏదో ఆకారం మెదిలింది. "ఎవ్రాడూ!" కేక.

"నేనే యాదిగాన్ని"

"ఎన్ని కూతలేసిన సప్పుడు జెయ్యరేందిరా కడుమోళ్ళ ఏడసచ్చిండ్రు?"

"మోటరు నీళ్ళు పోస్తలేదు ఇద్దరం యీన్నే మర్లాడుతున్నం. ఒకడు పెండ కళ్ళు దీస్తున్నడు, ఇంకోడు సేల 'గనుమలు గట్టబొయ్యిండు" చెప్పుకుంటూ సత్తిరెడ్డి జీతగాడు కొట్టంనుండి గ్రీసుడబ్బా తీసికెళ్ళుతూ ఓ కంట ఎరుకల వాళ్ళను చూస్తూ బావి గడ్డ వొంపులోకి మునిగాడు.

సత్తిరెడ్డి నడక వేగం హెచ్చింది. వరి మడిపైనుండి డొంకవైపు కానుగు చెట్ల వెంటి బిరబిరా నడిచాడు.

మోటరు నీళ్ళు పోసింది.

మత్తడి మురుగునీళ్ళపై వున్న చెత్తాచెదారం ఎండుటాకులు నీళ్ళతాకిడికి కదిలి కాలువలో కొట్టుకపోతున్నాయి. సత్తిరెడ్డి కానుగుపుల్లేసుకొని పండ్లు తోముకుంటూ కొట్టం వద్దకొచ్చాడు. జీతగాడొకడు కొట్టం లోపలినుండి కుర్చీ తెచ్చి వేశాడు. రెడ్డి సుఖాసీనుడయ్యాడు.

తెల్లగ తెల్లవారింది.

ఎరుకల వాళ్ళు వాళ్ళలో వాళ్ళేదో మాట్లాడుకుంటూ సత్తిరెడ్డిని చూసి నిశ్శబ్దం వహించారు.

"మీ అందరుట్ల పెద్దెవ్రా?" సత్తిరెడ్డి

"నేను బొంచను" ఒక ముసలతను ముందుకొచ్చాడు.

"ఏం పేర్రా నీపేరు?

"పోశిగాడంటరయ్యా"

"ఏ కాల మెట్లుంటదో బిడ్డా మీ దెగ్గర బంగారం, ఎండి ఏమన్నా వుంటె ముందే నాకు జూపియ్యిండ్రా. ఊరిలేమన్న కాని పనైతె అది మీ మీదికి రాగల్ల."

"రోజుకో పూట గంజి దొరుకుడే యెటమటమైతది.బంగారమాపటేలా మమ్ములను కోసినా దొర్కదు."

"ఆ గదే జెప్తున్న! ఇంగ పోతె ఇత్తడి స్టీలుసామాన్లు?"

"ఇత్తడేంలేదుగాని నాల్గు తలెలు, అరు గిలాసలు, మూడు సెంసెలు, స్టీలుయి ఉన్నయి నాయిన" కూర్చున్న చోటునుండి లేచి ముందుకొస్తూ అన్నది ఓ ముసలావిడ. ఈమె పోచయ్య భార్య.

సత్తిరెడ్డి ఆ విషయం ఇంకేమీ మాట్లాడలేదు. మరొక్కసారి వెలుతురులో అందరినీ పరికించి చూశాడు. లేచి నిలబడుతూ "మీరు ఎరుకగూడ జెప్తారె?" ఆమె నడిగాడు.

"మేం ఎరుక జెప్పం పటేలా! కుచ్చెరుకలోళ్లు అళ్ళు ఏరే" అంది ఆవిడ.

"మేం ఏం జేసినా తట్టలూ, బుట్టలల్లకమే జాస్తి, ఇంగ ఓ ఊరు పట్టుకుంటే గిన్ని పందులగూడ పెంచుతం కాని, సోదిజెప్పకం మాకులేదు" అన్నాడు పోచయ్య.

"ఏం తట్టలు బుట్టలో గని, శేల పొంటె ఎలుకలు పట్టే ఎర్రిగూడుంటది మీకు. మరి నా మడికట్లల్ల పొక్కలన్ని జేసి పొయ్యేరు! మడికట్లల్ల కడుగుపెట్టొద్దు. ఇప్పుడే జెప్తున్న మరి" అంటూ ఇంటి దిక్కు నడవసాగాడు.

కొంతదూరం నడిచి "అంగో ఆ కంచె మూలకు గుడిసె లేసుకోండ్రి" గట్టిగా చెప్పి "ఎవ్వడొచ్చినా నా జాయికాడికే ఒస్తడు. కాదని ఎల్లగొట్టినా ఊర్ల పొంటి పటేలు మంచోడుకాడని బద్నాం జేస్తరు లంగలంజకొడుకులు" మెల్లగా తనలో తాను గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

సత్తిరెడ్డికి కావలసినంత భూముంది. రాత్రిపగలు పదిమంది జీతగాళ్ళు చేసినా తీరని వ్యవసాయం చేయొచ్చు. కాని నల్గురు జీతగాళ్ళనే పెట్టుకున్నాడు. ఎక్కువ మందిని పెడితే తలనొప్పని అయినంతవరకే కానీ అంటూ కొన్ని సెలకలు పశువుల గడ్డికోసం వదిలేశాడు.

సాగుచేస్తే ఇంకా కంచెగూడా వుంది. రాళ్ళు రప్పలతో నిండిన బోడగుట్ట క్రింది భాగమంతా సత్తిరెడ్డి సొంతం భూమని చెప్పుకుంటాడు. ఆగుట్టనానుకొనే వున్న అరవై ఎకరాల గుడ్డం అంచునే ఎరుకలవాళ్ళు గుడిసెలేసుకున్నారు.

మధ్యాహ్నం రెండు గంటలు దాటింది. నిన్నటిరాత్రి కాచుకున్న గంజి రాత్రి తాగగా మిగిలింది. ఎవరి గుడిసె వాళ్ళు వాళ్ళ సంతానంతో తాగేశారు. మొత్తం ఏడు గుడిసెలు పడ్డాయి.

అప్పటికే గుట్టకిందివైపు వెళ్ళిన యువకుడు దయానందు భార్యతో బాటుగా కొన్ని కుచ్చెరు బరిగెలు మోసుకొనివచ్చి గుడిసెలముందు వేశాడు. సత్తిరెడ్డి బావి

596

వైపునుండి ఒక జీతగాడు పరిగెత్తుకుంటూ రావడం చూశాడు. ఎగదమ్ముతో రొప్పు తున్నాడు "అరే హో....పోశయ్యను పటేలు పిల్చుక రమ్మన్నడు. పటేలు పడమ టింట్ల పాము. పొక్కలకు పొయ్యింది. మొన్ననే ఒకర్ని కరిసింది. దాన్ని సంపాలె" అన్నాడు దమ్ము తీస్తూనే.

"పామును సంపేటోళ్ళేలేరాఊర్లె? మేమెందుకయ్యా''దయానందు అడిగాడు.

''అదికాదు, అది పొక్కలకు పొయ్యింది మీరు ఎలుకల వడ్తరుగదా, దాన్ని ఎట్ల పట్టాల్నో మీకే తెలుస్తుదని మీదెగ్గరికు పంపింది'' అని చెబుతూ పోశయ్య దిక్కు చూశాడు అతను.

''ఎలుకలు వడ్తంగాని, పాములుపట్టం. పాముల వడ్తందుకు పాములోళ్ళు....'' ఇంకా ఏమో చెప్పబోయాడు దయానందు. కాని, పోశయ్య మధ్యలో అందుకొని "అరే సందూ! పటేలుతోని మనకున్న పని సంగతి తెలిసే మాట్లాడుతున్నావ్‌రా! యీతబరిగె ఇవ్వమని అడుగుదామంటివిపోదాం పా.... దాన్ని సంపొస్తే మనకే మంచిది" ఎరుకల భాషలో అంటూ వచ్చినతనితో ముందుకు నడిచాడు.

''ఆ! ఉత్తపుణ్యానికే ఇస్తడాఏంది పైసలు దీస్కోడూ?'' తప్పనిసరిగా పెద్ద మనిషివెంట నడవక తప్పలేదు. కడుపులో పేగులు మండుతున్నాయ్.

దయానందు పోచయ్య తమ్ముని కొడుకు. తమ్ముడి కొడుకైనప్పటికీ తనే అన్ని బరువు బాధ్యతలు మోసి నల్లగొండ జిల్లా కొండమడుగు గ్రామంనుండి పిల్లను తెచ్చి పెండ్లి చేశాడు. దయానందు పెళ్ళి జరిగి నాల్గు ఏండ్లు దాటింది. పిల్లలు లేరన్న బాధ ఒక్కటి తప్పిస్తే మరే ధ్యాస వాళ్ళకు లేదు.

పొద్దు పడమటివైపు తిరిగింది. వెళ్ళినవాళ్ళింకా రాలేదు. పుల్చేరు బరిగె గుడిసె కాడ వేయగానే ఊళ్లోకి వెళ్ళి రెండురూపాయల సూకలు కొనుక్కొస్తానని చెప్పి మాటల్లోపడి అలా వెళ్ళిపోయాడు. జానమ్మ మనసంతా భర్తమీదే వుంది. మాటి మాటికీ ఊరి దిక్కుగా చూస్తూ నిలబడిపోయింది.

చీకటిపడుతుందా వెళ్ళినవాళ్ళు తిరిగివచ్చారు. కాని, దయానందు ముఖం కొంచెం వాడినట్లుగావుంది. పెదవులు ఒక మూలనుండి సన్నగా చొల్లు కారు్చ కుంటున్నాడు. కళ్ళు కొంచెం మూతలు పడుతున్నాయ్. కుడిచెయ్యి అరదండాకు బిగ్గరగా ఏదో కట్టుకట్టుంది. జానమ్మ భయంతో దిగులుతో ఏమైందని ఆత్రంగా అడిగింది.

597

"పాము కరిసిందమ్మా మంత్రమేపిచ్చినం, ఊరిబైటికొచ్చి ఆగ్గూడ కట్టినం. నిద్రపోనియ్యకుంట సూడు. అదిగ నీసేతులుంది." అంటూ పోచయ్య "అది కరిసినా దాన్ని ఇడిసిపెట్టలే మనిషంటే ఈడే! దాన్ని సంపే ఆడికెళ్ళి కదిలిండు" గుడిసె లోనికివెళ్ళి బొంత తెచ్చి నేలమీద పరిచాడు.

జానమ్మ నెత్తిన పిడుగురాలినంత పనైంది. తనేడిస్తే భయపడతాడేమోనని అతనిముందు ధైర్యాన్ని ప్రదర్శించి గుడిసెలోకెళ్ళి వెక్కి వెక్కి ఏడ్చింది. అందరూ వచ్చి దయానందు చుట్టు చేరారు. "అయ్యో కొడుకా ఇప్పుడేం జేద్దునురో" తండ్రి ఏడుస్తున్నాడు.

దయానందును ఎన్నోసార్లు పాములు కరిచాయి, కాని, ఈ విధంగా కనిపించడం ఇదే మొదటిసారి. జానమ్మకు భయంగా వుంది. ఏడుస్తూ తన భర్త నోటి నుండి కారే చొల్లును చీరకొంగుతో తుడుస్తుంది. దయానందు తల్లి శోకం పెట్టింది. కోడలే దరిద్రపుది. కనుకనే ఇన్ని కష్టాలు కొడుకు కొచ్చాయని ఆమె ఏడుపు సారాంశం. జానమ్మ అవేవీ పట్టించుకోకుంది. మత్తుగా తెరిచే కళ్ళలోకి చూస్తూ దీనాతి దీనంగా పిలుస్తుంది భర్తని. కంటి రెప్పలమీద బరువైన వస్తువేదో పెట్టినట్లుగా ఎంతో ప్రయత్నంతో భార్యని చూడాలనుకుంటున్నాడు. ఏదో మాట్లాడాలను కుంటున్నాడేమో పెదవులమీదకు చిరునవ్వు వచ్చి మాయమైంది. రాత్రంతా కంటికి పుట్టెడు ఏడుస్తూ తన బతుకు బండరాళ్ళు చెయ్యొద్దని ముక్కోటి దేవుళ్ళకు మొక్కుకుంది.

ఆరాత్రి ఎవ్వరూ ఎంగిలి పడలేదు. నిద్రపోలేదు. తెల్లవారింది, విషం పని చేయని కారణంగానైతేనేమి, కట్టిన మందు ప్రభావంతోనైతేనేమి దయానందు బతికాడు. మధ్యాహ్నం వరకు లేచితిరిగే శక్తి వచ్చింది. సాయంత్రం వాళ్ళందరూ కూడి బావివద్దకొచ్చిన సత్తిరెడ్డిదెగ్గరకెళ్ళారు. పాము కరిచింది. కళ్ళారా చూసినా ఎలావుందని అడగలేదు.

"ఆ! ఏంరా ఇంకెన్ని రోజులుంటరూ?" అడిగాడు.

"వొచ్చి మూడురోజులన్నాగాలే ఇప్పుడే పొమ్మంటావ్‌పటేలా!గా కొండకింద కంచెల, మీబాయి సుట్టూరునున్న ఈతబరిగె కోసుకొని రెండ్రోజులు మీపేరుమీద గంజి తాగుతం" పోచయ్య అడిగాడు.

"అవీటిని కంటికి రెప్పల్లెక్క సూసుకుంట ఎవ్వరిని ముట్టనియ్యకుంద కాపాడిన, మీకు దానం జేస్తందుకురా! గామూదేండ్లకింద పక్కూరు ఎరుకలోల్లు రెండు వందలిచ్చి కోసుకున్నారు. మల్ల ఆల్లకే ఇస్తనని మాటిచ్చిన.

598

"ఆశవడొ స్తిమి కార్మొక్త! మాకు పుత్రసెయ్యి జూపకు. మావోడు నిన్న సస్తోడు బతికిండు. మీ పుణ్యమే అడ్డొచ్చింది. లేకుంటే ఇంకోతీరుగయ్యేది. అన్ని జూసైనా దయసేయ్యండ్రి. రూపాలియ్యమనిగాదు అన్నో ఇన్నో ఇచ్చుకుంటం" పోచయ్య తమ్ముడు మైసయ్య సత్తిరెడ్డి రెండు కాళ్ళమీదాపడి బతిమిలాడాడు.

"పామును సంపమన్నగాని దాంతోని కరిపిచ్చు కొమ్మన్నానురానేను" సత్తిరెడ్డి లేచి ముందుకు నడిచాడు. ఐనా వాళ్ళు ఆయన్ని వదిలిపెట్టలేదు. కాళ్ళా వేళ్ళాపడి ఈతబరిగెల కోసుకోడానికి ఎలాగైతేనేం ఒప్పించారు. వంద రూపాయ లిస్తామని చెప్పారు.

రాత్రి ఎనిమిదిగంటల వేళప్పుడు ప్రతిరోజులాగే జీతగాళ్ళందరూ వెళ్ళి పోయాక ఇంటిముఖం పట్టిన సత్తిరెడ్డి పోచయ్యని పిలిచి "ఈతబరిగె కోసుకుంటే కోసుకోండ్రిగాని బాయి దిక్కు వొంగివున్న ఆ రొండుసెట్ల బరిగెతే కోయకుండ్రి. అ వీటిని ముట్టకుండ్రి" అని చెపుతూ వెళ్ళిపోయాడు.

ఎండాకాలమంతా సత్తిరెడ్డికి జీవిగంజి పోసినట్లుగా సేద దీర్చినవి ఈతచెట్లే. పొద్దు మూకగానే వచ్చి బావివద్ద కూర్చున్నాడంటే పుట్టమీది ఆరెండు ఈతచెట్ల రెండులొట్లు ఖాళీగావలసిందే. బాగా చీకటిపడ్డాక జీతగాళ్ళను "ఇల్లకుపోయి దబ్బున తినిరాండ్రి. మీరొచ్చెదానుక నేనీన్నే వుంట" అని పంపించేస్తాడు. వాళ్ళువచ్చినా రాకున్నా ఎనిమిది గంటలు అవుతున్నట్లుగా తన చేతి గడియారం చూపిస్తే ఇంటి ముఖం పట్టడం రోజువారీ కార్యక్రమం. అతను రోజూ అట్లా వాళ్ళను పంపించడం, వాళ్ళు రోజూ తమకు తీరినపుడే నిదానంగా రావడం జరుగుతుంది.

ఆ రోజు మనవాళ్ళంతా గుట్టక్రింద బరిగె కొయ్యడానికి వెళ్ళిపోయారు. స్త్రీలు అరుగురు సత్తిరెడ్డి బావిచుట్టూ కోస్తున్నారు. అది సరిగ్గా సత్తిరెడ్డి మందు పుచ్చుకునే సమయం. బావి అంచున ఒక మూల కొడవలితో వంగి బరిగెలందు కుంటోంది జానమ్మ. సత్తిరెడ్డి కళ్ళు జానమ్మమీద పడ్డాయి. వెనకనుండి అతను వచ్చేది ఆమె గమనించలేదు. "ఏమే" అనగానే ఉలిక్కిపడి వెనక్కిచూసింది.

"ఆ! భయపడకు ఏంలేదు. ఈ బావి మీదవున్న రెండు సెట్లకు బరిగె కొయ్యొద్దని మీ వోళ్ళకుజెప్పిన నీకు జెప్పినారె?" అడిగాడు మెత్తగా

"అ-జెప్పిండ్రు" ముందుకు నడుస్తూఅంది.

"నీ మొగడు మంచి గైనాడె? పాపం నా కోసం అనికి పాము గరిసె;" నక్క సానుభూతితో మరికాస్త దెగ్గరయ్యాడు.

"ఆ మంచిగైందు పటేలా" అంటూనే చిక్కచిక్కగా ఉన్న చెట్లనుండి బయట పడ్డది జానమ్మ.

అతనూ అంతే వేగంగా ఆమెను చేరుకున్నాడు "ఏపిల్లా ఆగే? నిన్ను జూస్తుంటే పాసం తావునలేదు. నీకు నూరు రూపాలిస్త. రాత్రికి నా కొట్టం కాడికిరా" అడ్డంగా నిలబడి సూటిగా అన్నాడు.

"మంచిమాటకిమాసంగ పక్కకు జరుగు పటేలా! నేససొంటిదాన్ని గాను" తప్పించుకోని పెళ్ళిపోయింది.

మిగతా స్త్రీలు దూరంనుండి ఇదంతా చూశారు. సత్తిరెడ్డి మాటలు వాళ్ళకు వినిపించలేదు. సరిగదా పరపురుషునితో మాట్లాడినందుకు జానమ్మమీద తప్పు పట్టారు. జానమ్మ ఆ సమయంలో ఎవ్వరితో మాట్లాడలేదు. కోసిన బరిగెలు కట్టలు కట్టి ఎత్తుకొని గుడిసెల వైపుకు నడిచారు. జానమ్మ అత్తవారింటి కొచ్చిన నాల్గు సంవత్సరాలలో తనకొడుక్కి సంవత్సరానికొకటిగా ప్రమాదాలు జరుగుతున్నాయని దయానందుకల్లికి గుర్తొచ్చింది. "దలే దరిద్రపుది దీనితోటె తనకొడుకు ప్రమాదాలకు లోనౌతున్నాడు. పోయినేడు పచ్చికుక్క కరిసింది, అంతకు ముందటేడు వరదల్లో కొట్టుకు పోయినోడు వారం రోజులకు తిరిగొచ్చాడు. అంతకుముందు పెళ్ళి జరిగిన కొత్తలో పాము కరిచింది. అంతా దీనితోనే వుందని దీన్ని కులంనుండి వెలేయాలని అంది. గుడిసెల కందరూవచ్చాక జానమ్మ పరపురుషునితో మాట్లాడిందని అది కులానికే తలవంపులని కులంనుండి వెలేయాలని మిగతాస్త్రీలు ప్రతిపాదించారు. కులంనుండి వెలేయకూడదంటే ఆ అమ్మాయి తల్లిదండ్రులు కులం కట్టుగా అపరాధం ముప్పు చెల్లించి మళ్ళీ కాపురానికి పంపాలి. జానమ్మ తప్పుచేయకున్నా కులం-కులం పెద్దలు తప్పుచేశావని ఒప్పించి తల్లిదండ్రుల దగ్గరకు పంపించ జూస్తున్నారు. జానమ్మ అపరాధా లేక నిరపరాధా అన్నవిషయం కేవలం దయానందు గమనించగలుగు తున్నాడు. ఆధారం లేని తప్పుని సహించలేక........

"అది తప్పుజేసినా ఒప్పుజేసినా నాపెండ్లాం. నేనేలుకుంటా. మీకులం కట్టడి అన్నపేరుతోటి తప్పుజేయనోళ్ళ నెందర్ని ఎన్ని బాధలు పెడుతుండ్రు నేను జూస్త నేవున్న. నిజంగా అది తప్పుజేసిందని మీకందరికి అనిపిస్తే పొద్దటికి క[illegible] పెట్టుండ్రి. దాన్ని తల్లిగారింటికి పంపియ్య. ఇంగో పటుండ్రి ఏడురూపాయలు రేపు

పొద్దాకి కల్లుకుండ దెప్పిస్త" ఏడురూపాయలిచ్చి కోపంతో అక్కడినుండి లేచి వెళ్ళిపోయాడు అప్పటికే చాలా రాత్రైంది.

మరునాడు ఉదయం జానమ్మకు స్నానం చేయించి తడిబట్టలతో కొత్తపొయ్యి వేయించారు. కొత్తకుండ కొబ్బరికాయ పగ్గెరా వచ్చాయి. పొయ్యిమీద కడాయితో సలసల మసలే నూనెలో చెయ్యిపెట్టించి కులం కట్టడినుండి విముక్తిగావించారు.

ఈ వార్త సత్తిరెడ్డి జీతగాళ్ళద్వారా ఆనోటా ఆనోటా ఊరంతాపాకింది. సత్తిరెడ్డంటే గిట్టనివాళ్ళు కొందరు పనిగట్టుకొని ప్రచారంచేశారు. సత్తిరెడ్డికి పని కాకుండానే అపఖ్యాతి పాలయ్యానే అన్నకక్ష గూడు కట్టుకుంది. కోపం ఒకవైపున బుస కొడుతున్నా ఎంతో శాంతంగా ప్రయత్నం చేస్తున్నాడు.

దయానందు అపరాధం చెల్లించాడు. ఏ ఊరోవెళ్ళి డబ్బుతెచ్చి ఉన్న ఇరవై మందికీ కల్లూ, మాంసంతో భోజనాలు పెట్టించాడు. తాను పైకిఎలా వున్నా గుండె నిండా మంటలు లేస్తున్నాయి. కులపెద్దల మీద అసహ్యం, సత్తిరెడ్డిప్రవర్తన అతన్ని సతమతం చేస్తున్నాయి.

ఆ రోజు రాత్రే సత్తిరెడ్డి ఇంటి పక్క ఇల్లు సోమిరెడ్డి ఇంట్లో దొంగలు పడ్డారు. డబ్బు కొంతపోయింది. నగానట్రాపోలేదు. కొంత స్టీలు సామగ్రి పోయింది. ఉదయం పంచాయితీలో ఊరందరినీ పిలిపించారు, ఎరుకలవాళ్ళనూ పిలిచారు. పోలీ సొచ్చింది. ఎరుకల వాళ్ళదగ్గర సోమిరెడ్డి చెప్పినట్లుగానే నాల్గు తపెలు, ఆరు గిలా సులు, మూడు సెంసెలు దొరికాయి. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకొని సోమి రెడ్డికి అప్పజెప్పారు. ఎరుకల వాళ్ళమీద కేసు పెట్టనివ్వలేదు సత్తిరెడ్డి. సత్తిరెడ్డి ప్రోద్బలంతో వాళ్ళను చితగ్గొట్టారు. యువకులకు నెత్తుర్లు చిమ్మాయి, ముసలివాళ్ళ మోకాళ్ళు, మోచేతులు లేవకుండా చేశారు. తనమీద అపనింద పడేసిందని జానమ్మని గుడ్డలిడిసి కొట్టాలని సత్తిరెడ్డి హుకుం జారీ చేశాడు. ఎరుకల వాళ్ళంతా గొల్లున ఏడ్చి కనిపించిన ఊరి పెద్దలందరి కాళ్ళు పట్టుకున్నారు. గుడ్డలు లాగేయడం తప్పిందికాని దెబ్బలు తప్పలేదు. చివరికి ఊరిడిసి వెళ్ళిపొమ్మన్నారు.

'ఈత బరిగెను మాత్రం తీసుకెళ్ళొద్దు. మీ రిచ్చిన వంద రూపాయలకు అన్ని కట్టల బరిగె దేశం మొత్తం మీద వెదికినా దొరకదు. బరిగె సొంతం బావికాడి కొట్టం దగ్గరవేసి పోండి' అని సత్తిరెడ్డి గట్టిగా కోపంతో చెప్పాడు. ఎరుకలవాళ్ళకు ఎటూ తోచలేదు. బాధతో మూల్గుతూ ముక్కుతూ పోచయ్య ఇది ధర్మం కాదనీ, దయచేసి

601

మా బతుకు మమ్ముల బతకనీయమనీ వేడుకున్నాడు. వంద రూపాయలకు ఎంత బరిగె ఇవ్వదలిస్తే అంత ఇచ్చేస్తే వెళ్ళిపోతామని బతిమాలాడు. కానీ సత్తిరెడ్డి ఏమీ మాట్లాడకుండా మౌనం వహించాడు.

బాగా చీకట్లు పడుతున్న సమయం. ఒకరిద్దరు ఆడవాళ్ళు గుడిసెల ముందు మూడు రాళ్ళమీద కుండలుపెట్టి ఎంతకూ రాజుకోని పొయ్యి ఊదుతున్నారు. పొగకు కళ్ళు మంటలేస్తుంటే కళ్ళగుండా నీళ్ళు కారుతున్నాయి. దూరంగా గుంపుగా కూర్చున్న పురుషులందరిలో దయానందు లేచి నిలబడి చెయ్యినటూ ఇటూ ఊపుతూ ఏదో చెబుతు నాలుగడుగులు నడిచి పట్టుగోల తీసుకొని వాళ్ళలో వున్న పన్నెండు సం॥రాల పిల్లవాడ్ని వెంటపెట్టుకొని చీకట్లో కలిసి పరుగుదీశాడు.

మరునాడు పచ్చిగా పుండ్లయిపోయిన దేహాలతో ఎలాగో మూటాముళ్ళే సర్దుకుంటున్నారు. మధ్యాహ్నం వేళప్పుడు సత్తిరెడ్డి జీతగాడు వచ్చి చూసి "మీరింకా పోలేదా పటేలు చూసి రమ్మన్నాడు" అంటూ తిరిగి వెళ్ళిపోయాడు.

సాయంత్రం వరకూ ఎరుకలవాళ్ళు తట్టాబుట్టాతో అంతా సర్దుకుని వెళ్ళడానికి సిద్ధమయ్యారు. పశువుల మందల, గొర్లమందల అరుపులు వినిపిస్తున్నాయి. పొద్దంతా నడుములు వంచి నాట్లేసిన ఆడపడుచులు ఇళ్ళకు ఆసికాలాడుకుంటూ వెళుతున్నారు. వాళ్ళలో వున్న వయసుమళ్ళిన కూలీలు వెనకబాటుగా నడుస్తూ సత్తిరెడ్డి బావి మీదుగా వెళుతున్నారు. "పాపం అన్యాయంగా ఈళ్ళను కొట్టి సంపిరి" అని ఒకావిడంటే "ఆనికి పొయ్యేకాలమొచ్చింది బక్కలేక పొట్ట సేత్లపట్టుకొని ఒచ్చినోళ్ళను గోస ఉచ్చుకునె" మరొకామె మాట్లాడుకుంటూ బాటసాగుతున్నారు.

నిన్నరాత్రి జరిగిన మహాకార్యానికి ఆనందంతో సత్తిరెడ్డి ఇంట్లో విందు జరిగింది. ఉదయమే ప్రారంభమైన విందు తతంగం ఇప్పపూల సారాతో మధ్యాహ్నం దాటాక ముగిసింది. పోలీసులు వెళ్ళిపోయారు. సత్తిరెడ్డి మత్తింకా వదల్లేదు. ఐనా ఇంకా తాగాలని కోరికగా వుంది. కానీ సారా ఐపోయింది. వెంటనే పక్కూరికెళ్ళి తెమ్మని ఒక జీతగాన్ని పంపాడు. "పొద్దూకి పొయ్యింది ఇంకేం తాగుతరు ఇంక పూకుంటె గాదా?" అని భార్య అంటున్నా వినకుండా జీతగాణ్ణి తిట్టి మరీ పంపించాడు.

సారాకని వెళ్ళిన వాడల్లా పదినిమిషాల్లో తిరిగొచ్చి "పటేలా రాపోలు, దొండ గూడెంల ఉన్న ఎరుకలోళ్ళు పిల్లాజెల్లా అందరూ కలిసొస్తుంట్రు. నేను బీరప్ప బండకాడికెల్లి జూసి వురికొచ్చిన" అని చెప్పాడు.

602

"ఆ!! ఒస్తే ఏందిరా మరి, నీకెందుకు భయమైంది?" అడిగాడు సత్తిరెడ్డి.

"పోలీసులేమొ ఎల్లిపోయిరి ఆళ్ళందరొచ్చి మనమీద పడితె?"

"మనమీదెందుకు పత్తర్రా ఎర్రిలంజకొడకా. ఆళ్ళల్ల మనకు దెల్వనోళ్లున్నరా?" సత్తిరెడ్డి అంటున్నాడు కాని లోపలేదో భయం చోటుచేసుకుంటూనే వుంది. "నువ్వు బాయికాడికి పొయి ఆళ్ళింకా వున్నరేమో సూసిరా పో" అని పంపించాడు.

టీతగాడు బయటికి నడిచాడు. ఇంకా పూర్తి చీకటి పడలేదు. ఊరికి నాల్గువైపుల నుండి ఎంతో మంది ఎరుకలోళ్ళు సత్తిరెడ్డి బావివద్ద నున్న గుడిసెల దిక్కువెళుతున్నారు. పొలాల్లో పనిచేసి వస్తున్న వాళ్ళందరూ వాళ్ళను ఒక కంట చూస్తూ ఏదో జరుగబోతుందని అనుకుంటున్నారు గానీ, "ఎందుకొచ్చింర్రా మీరందరూ ఈ వూరికి!" అని అడిగే ధైర్యం చాలకుంది. ఎరుకలవాళ్ళు వాళ్ళలో వాళ్ళేదో మాట్లాడుకుంటూ ఎవరన్నా తమను గమనిస్తున్నప్పుడు మౌనం వహిస్తున్నారు. సుమారు వంద మంది అక్కడ గుమిగూడారు.

పోచయ్య మూల్గుతూ మెల్లగా లేచి నిలబడి "మిస్కుల సంతా జూస్తుంటే ఇంతమంది నా సావుగ్గూడారారని పిస్తుంది. ఇంత మంది ఈడ గూడింర్రు. మన కులానికి ఒక మంత్రం లేదు, తంత్రం లేదు, రాతలేదు. ఎండ్ల గింతలేని కులం మనది. పేగులుండగట్టుకొని వూరూరు తిరుక్కుంట బతికెటోళ్ళం. ఒకర్ని ముంచే గునం, దొంగతనం మనకులేదు." ముసలోని గొంతు జీరపొయ్యింది. "చెయ్యని తప్పు జేసిందని ఆడిగద్ద, ముందుగాళ్ళ అడిగి తెల్సుకొని మాతాన ఉన్న సామాన్లే పొయినయని దొంగతనం బెట్టి సావదన్నింర్రు" ఇంకా ఏమో చెప్పబోతున్నాడు.

"ఆడుమల్ల తప్పెత్తడు. పోదాం పదండ్రి అడుగుదాం" ఒక నడివయసు ఆడమనిషంది.

"ఓరి ముసలోడ మాకన్ని ముచ్చట్లు దెలిసే వొచ్చినంరా. పాండ్రి ఆడికి పొయ్యే అడుగుదాం." మరోవ్యక్తి కేకేశాడు గుంపు మధ్యనుండి.

జనమంతా కదిలారు. దయానందు అందరికీ ముందు నిల్చి "ఆగుర్రి అగ జూడుండ్రి. సేను కింద కట్ట పొంటి ఎవరో అంతజూస్తుంర్రు. పది మందిని పెట్టి ఆడు మనను కొట్టించినా కొట్టిస్తడు. బద్రంగుండాలె. అందరు కట్టెలు దీస్కోండ్రి" అన్నాడు.

603

దూరంగా కదులుతున్న ఆకారాలు మరి కనిపించలేదు. ఊరి మధ్యకు ఎరుకలవాళ్ళ గుంపు ఎళ్ళిందో లేదో ఇద్దరు సత్తిరెడ్డి జీతగాళ్ళు ఎదురయ్యారు. "మీ బరిగె మీరు తీసోక్కని పొమ్మంటుండు పటేలు" అని చెప్పారు.

"బరిగెనే కాదు. మనుష్యుల నెందుకు కొట్టిండో కూడ చెప్పాలె.... అన్నిట్టి గిడ్సిపెడ్తాం?" ఎవరో యువకుడు.

ఎరుకలవాళ్ళ చేతుల్లో వున్న కొడవళ్ళు, కర్రలూ చూసి ఎక్కడి జనం అక్కడ బిక్కుబిక్కున, చాటుమాటుగా చూస్తున్నారు గానీ, ముందుకొచ్చి ప్రశ్నించే ధైర్యం చేయలేదు. అందరు చూస్తుండగానే సత్తిరెడ్డి మిద్దె వద్దకు చేరుకున్నారు.

ఎవరో ఆడమనిషి తలుపు దగ్గరకొచ్చి "లేడు పటేలింట్ల లేడు" అంటూ తలుపేయ బోయింది.

"లేదో వున్నడో మాకు దెల్సు. తలుపు దియ్యి" ఒక్క తన్ను తన్నాడు దయానందు. తలుపు పెద్ద చప్పుడుతో గోడలకు తాకింది. "ఇంగేం జేతుంరో నాయనో సంపెటట్లున్నర్రో కొడుకో" లోపలినుంచి ఆడవాళ్ళ ఏడుపు. అప్పటికే కొందరు ఎరుకలవాళ్ళు లోపలికి వొచ్చేశారు. "ఏడి? ఎక్కడసాయె? పట్టుకోండ్రి" అరుపులు. "ఎన్నిరోజు లాడ్తడు నాటకాలు తన్నుండ్రి."

సత్తిరెడ్డి మిద్దెపైకెక్కాడు. చుట్టు పక్కలున్న రెడ్లను కేకేశాడు. కానీ ఎవ్వరూ మారు పలకలేదు. తప్పించుకునే మార్గమూ లేదు. మాటవిన్న ఎరుకలవాళ్ళు మిద్దెక్కసాగారు. చంపేస్తారు, వీళ్ళ చేతుల్లో తన చావు తప్పదనిపించింది. వెనక వైపు నుండి ధైర్యంచేసి కిందకు దూకేశాడు. ఇల్లంతా గాలించాక, ఇంటి వెనకనుండి వినిపించే ఏడ్పులో "సత్తిరా నాయనో" అనే మాట వినిపించింది. సత్తిరెడ్డి రెండు కాళ్ళూ విరిగి పోయాయి. తలకు బలమైన గాయం తగిలింది. వచ్చినవారి అరుపులు, కేకలు మెల్లమెల్లగా తగ్గిపోయాయి. ఆ మిద్దె చుట్టున్న ఇండ్ల తలుపులు తెరుచుకోలేదు. ఎరుకలవాళ్ళు వెళ్ళిపోతుంటే కొందరు రైతుకూలి జనం "ఏమైంది మీ పంచాది ఎంత కొచ్చింది" అని అడిగారు. వాళ్ళు జవాబు పెద్దగా చెప్పకుండా "ఆడు మా ముంగటి కొచ్చినాడు?" అంటూ వెళ్ళిపోయారు. తెల్లవారింది. ఎరుకల గుడిసెలు లేవు. ఈత బరిగె లేదు. ఊరు ప్రశాంతంగా వుంది. "సత్తిరెడ్డి బతికేటట్టు లేడంట" అని అందరూ అనుకుంటున్నారు.

604